క్లుప్తంగా

అమ్మవారికి సారె సమర్పించిన నందిగామ ఏసీపీ



పెనుగంచిప్రోలు:ఆషాఢ మాసం సందర్భంగా నందిగామ ఏసీపీ తిలక్ దంపతులు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారికి శుక్రవారం సారె సమర్పించి బోనాలు చెల్లించారు. సారె సమర్పించిన అనంతరం ఆలయ అధికారులు ఏసీపీ దంపతులను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎంఎస్కె అర్జున్, ఏఎస్ఐ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భారతదేశం సంస్కృతి చాలా గొప్పది



కీసర(కంచికచర్ల):మండలంలోని కీసర బిజేటి డిగ్రీ కళాశాల, సెయింట్ లస్సెల్లా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను ఫ్రాన్స్ దేశంలోని రీమ్స్ పట్నంకు చెందిన విద్యార్థులు కల్చరల్ ఎక్స్చేంజ్‌లో భాగంగా శుక్రవారం వచ్చారు. భారత దేశం సంస్కృతి చాల గొప్పదని, సాంప్రదాయాలు బాగున్నాయని చెప్పారు. అనంతరం పాఠశాల పనితీరు గురించి స్కూల్ ప్రిన్సిపల్ బ్రదర్ అంటోని వివరించారు. కార్యక్రమంలో బిజేటీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దుగ్గిరాల ప్రకాష్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

వీరులపాడు:వాహనదారులు విధిగా నిబంధనలు పాటించాలని ఎస్ఐ అనిల్ తెలిపారు. మండలంలోని పెద్దాపురం గ్రామ సమీపంలో శుక్రవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మంది తలకు గాయాలై మృత్యువాత చెందిన ఘటనలు అనేకం ఉన్నాయని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించటం వల్ల ప్రమాద తీవ్రత తక్కువగా ఉంటుందని చెప్పారు. ఆటోవాలాలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని సూచించారు.

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన



పెనగంచిప్రోలు: మండలంలోని అనిగండ్లపాడు, కొల్లికుళ్ల జెడ్పీ హైస్కూల్స్‌లో శుక్రవారం విద్యార్థులకు శక్తి యాప్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తి యాప్‌నకు సంబంధించి ఏఎస్ఐ హనుమయ్య మాట్లాడుతూ విద్యార్థినులపై సమాజంలో జరుగుతున్న దాడులు, వాటిని ఎలా ఎదుర్కోవాలో తెలియజేశారు. శక్తి యాప్ ఎలా ఉపయోగించాలో వివరించారు. శక్తి యాప్ ఉపయోగించి రక్షణ పొందవచ్చన్నారు.

బోరు పంపు ప్రారంభం



పెనుగంచిప్రోలు:స్థానిక కల్వరీ జీవం మినస్ట్రీస్ ప్రార్థనా మందిరం వద్ద శుక్రవారం జీఎస్ఎస్ (గ్రేస్ సర్వీస్ సొసైటీ) వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోరు పంపును ఎస్ఐ ఎంఎస్కె అర్జున్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్ఎస్ సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శెట్టిపోగు రాము, సంస్థ నిర్వాహకులు జాన్, పాస్టర్ ఎర్నెస్ట్ పాల్ , దైద వినోద్‌కుమార్, ఎస్ సురేష్, దారా గౌతమ్, చింతల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పెద్దవరంలో స్వచ్ఛాంధ్ర

కంచికచర్ల: నందిగామ మండలం పెద్దవరంలో శనివారం స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తామని ఆర్డీఓ కె.బాలకృష్ణ శుక్రవారం తెలిపారు. కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పాల్గొంటారని పేర్కొన్నారు. మండలస్థాయిలో అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

రెండు గ్రామాల్లో తొలి అడుగు

చందర్లపాడు(నందిగామ టౌన్):కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. చందర్లపాడు మండలం కొత్తపాలెం, పొక్కునూరు గ్రామాల్లో శుక్రవారం సుపరిపాలన–తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పథకాలతో పేదల జీవితాలలో వెలుగులు నిండాయన్నారు. నాయకులు గుత్తికొండ రాంబాబు, మేకల సుధాకర్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళ తప్పిన పాఠశాలలు!

- తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- ఆందోళనలో తల్లిదండ్రులు



పెనుగంచిప్రోలు చింతల బడిలో విద్యార్థులు

పెనుగంచిప్రోలు:పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చింది. మనబడి నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చి దిద్దారు. జగనన్న విద్యాకానుక, గోరుముద్ద వంటి కార్యక్రమాలతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివేందుకు ఆసక్తి చూపేలా మార్పులు చేశారు. అత్యంత ఆధునిక పరికరాలతో మరుగుదొడ్ల నిర్వహణ, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు చూసి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అయితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రభుత్వ బడుల నిర్వహణ పట్టించుకోకపోవటంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది తగ్గింది. దీనికి తోడు యూపీ పాఠశాలలను 3 కిలోమీటర్ల లోపు జెడ్పీ హైస్కూళ్లలో విలీనం చేయటం వలన కూడా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు తగ్గుతున్నట్లు విద్యాధికులు అంటున్నారు. గత ప్రభుత్వంలో విద్యాకానుక మొదటి రోజే విద్యార్థులకు అందించగా ఈప్రభుత్వంలో యూనిఫాం విద్యార్థులకు పాఠశాలలు తెరిచిన కొన్ని రోజుల తరువాత అందజేశారు.

ప్రైవేట్ పాఠశాలలకు మొగ్గు చూపుతున్న విద్యార్థులు...

ప్రభుత్వ బడులను పట్టించుకోక పోవటంతో విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని, ముఖ్యంగా యూపీ పాఠశాలలను విలీనం చేయటంతో ఆ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో 2024–25లో 2644 మంది విద్యార్థులు ఉంటే ప్రస్తుతం 2025–26 ఏడాదికి సంబంధించి 2420 మంది ఉన్నారు. అలాగే మొత్తం మండలంలో 71 మంది ఉపాధ్యాయులకు గాను 15 మంది బదిలీపై వెళ్లగా 13 మంది వచ్చారు. మండలంలో 20 మంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో పెనుగంచిప్రోలు చింతలబడిలో 13 మంది ఉన్నారని చెబుతున్న వాస్తవంగా 8 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. అనిగండ్లపాడు ఎస్టీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో 14 మంది, గుమ్మడిదుర్రు ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో 14 మంది, కొణకంచి ఎయిడెడ్ పాఠశాలలో ఏడుగురు, సుబ్బాయిగూడెం ప్రాథమిక పాఠశాల(మెయిన్) 16 మంది విద్యార్థులు ఉన్నారు.

విలీనం పాఠశాలల్లో...

జెడ్పీ హైస్కూల్‌లో విలీనం అయిన గుమ్మడిదుర్రు యూపీ పాఠశాలలో గత ఏడాది 80 మంది విద్యార్థులు ఉండగా ఈ ఏడాది 47 మంది, ముచ్చింతాల యూపీ పాఠశాలలో గత ఏడాది 92 మంది విద్యార్థులు ఉంటే ఈ ఏడాది 44 మంది, తోటచర్ల యూపీ పాఠశాలలో గత ఏడాది 54 మంది విద్యార్థులు ఉంటే ఈఏడాది 21, శివాపురం యూపీ పాఠశాలలో గత ఏడాది 53 మంది విద్యార్థులు ఉంటే ఈఏడాది 33, లింగగూడెం యూపీ పాఠశాలలో గత ఏడాది 18 మంది ఉంటే ఇప్పుడు అలానే ఉన్నారు.

విద్యార్థుల సంఖ్య తగ్గింది



పాఠశాలల విలీనం పేరుతో మా గ్రామంలోని యూపీ పాఠశాలను అనిగండ్లపాడు జెడ్పీ హైస్కూల్‌లో కలపటం వలన విద్యార్థుల సంఖ్య బాగా తగ్గింది. విద్యార్థులు ఎక్కువగా ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. గత ప్రభుత్వంలో ప్రభుత్వ బడులను ఉన్నతంగా తీర్చి దిద్దారు.

–నక్కా కమల, సర్పంచ్ గుమ్మడిదుర్రు

బ్లాక్ మార్కెట్‌లో ఎరువులు విక్రయిస్తే చర్యలు



నందిగామ రూరల్:కృత్రిమ కొరత సృష్టించి ఎరువులు, పురుగు మందులను బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తే సహించేది లేదని ఆర్డీవో బాలకృష్ణ స్పష్టం చేశారు. పట్టణంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, పురుగు మందులు, విక్రయించాలని ఆదేశించారు. రైతులు యూరియా అడిగితే ఇతర ఎరువులు, మందులు కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామనే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధరల పట్టికను బహిరంగంగా ప్రదర్శించాలని చెప్పారు. అంతే కాకుండా రైతులు నానో యూరియా వినియోగించేలా అధికారులు, డీలర్‌లు ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం అత్యవసర ఎరువుల లభ్యత, ధరలు, నిల్వలకు సంబంధించిన రికార్డులను సమగ్ర పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాసరావు, తహసీల్దార్ సురేష్‌బాబు, ఏడీఏ కార్యాలయ సిబ్బంది వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాన్ని ఎండగడతాం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు



క్యూఆర్ కోడ్ స్కానర్ ఆవిష్కరణలో తన్నీరు నాగేశ్వరరావు, ఫిరోజ్‌ఖాన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు

జగ్గయ్యపేట అర్బన్:ఎన్నికలకు ముందు అమలుకు సాధ్యం కాని ప్రజాకర్షక పథకాలను ఇస్తామని నమ్మబలికి, అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నమ్మి ఓట్లు వేసిన వారిని దారుణంగా మోసం చేసిన చంద్రబాబు నిజ స్వరూపాన్ని ఇంటింటికి ప్రచారం చేసి ఎండగట్టాలని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బాబు షూరిటీ–మోసం గ్యారంటీ అనే కార్యక్రమం 3 వ దశలో భాగంగా శుక్రవారం సాయంత్రం జగ్గయ్యపేట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్ అధ్యక్షతన జరిగిన బాబు షూరిటీ–మోసం గ్యారంటీ పట్టణ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో తన్నీరు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత బాబు షూరిటీ–మోసం గ్యారంటీ పేరుతో రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. అనంతరం తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అడుగడుగున ఎదురైన వైఫల్యాలను వార్డుల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. సూపర్ సిక్స్ అంటూ అమలు సాధ్యం కాని పథకాలతో చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించాలని కోరారు. కూటమి ఏడాది పాలనలో ఏమున్నది గర్వకారణం..ఇచ్చిన హామీలను అడుగడుగున విస్మరించడం, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం, దౌర్జన్యాలకు పాల్పడడం తప్ప ఏమి చేశారని ప్రశ్నించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనపై ఇప్పటికే ప్రజల్లో అసంతృప్తి ఏర్పడిందని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో జగ్గయ్యపేట మున్సిపాలిటీలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగుర వేస్తామని పేర్కొన్నారు. అప్పటి వరకు విశ్రమించేది లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా, పార్టీ పేట మండల అధ్యక్షుడు బూడిద నరసింహారావు, పార్టీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి నంబూరి రవి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి దర్శనాల వెంకటరమణ, రాష్ట్ర చేనేత విభాగం అధికార ప్రతినిధి పెంటి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి షేక్ జుబేర్, లీగల్ సెల్ రాష్ట్ర నాయకుడు సత్యశ్రీనివాసరావు, పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు షేక్ మున్నిహీరా, పట్టణ యూత్ అధ్యక్షుడు రామిని ఉపేందర్‌రెడ్డి, పార్టీ వివిధ అనుబంధ విభాగాల నియోజకవర్గ, మండల, పట్టణ స్థాయి నాయకులు పిడమర్తి ప్రభు, మీసాల బాబ్జి, పింగళి నర్సింహరెడ్డి, దివ్వెల రామారావు, దర్శి వెంకటేశ్వర్లు, అన్నెపాగ మురళి, దారెల్లి మహేష్, అట్రగడ్డ బాలస్వామి, వల్లెంకొండ రామారావు, సంపంగి గోపాలకృష్ణ, కె.ఖాదర్‌బాబు, బండి రాజు, మోరె దుర్గాప్రసాద్, దేవరశెట్టి వీరాంజనేయులు, గొట్టిపాళ్ల సురేష్, ఆర్టీసీ ఖాదర్‌బాబు, దారెల్లి రాజు, ఉమాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు షేర్‌మహ్మద్‌పేటలో బాబు షూరిటీ–మోసం గ్యారంటీ




మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పేట మండల అధ్యక్షుడు బూడిద నరసింహారావు, నేతలు

జగ్గయ్యపేట అర్బన్:మండలంలోని షేర్‌మహ్మద్‌పేట గ్రామంలో శనివారం సాయంత్రం 4 గంటలకు బాబు షూరిటీ–మోసం గ్యారంటీ అనే అంశంపై వైఎస్సార్ సీపీ మండల స్థాయిలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బూడిద నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం జగ్గయ్యపేట పట్టణంలోని పార్టీ కార్యాయలంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పాల్గొంటారని చెప్పారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, మహిళలు, సానుభూతిపరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి దర్శనాల వెంకటరమణ, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జవ్వాజి నరసింహారావు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు బండి రాజు పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ..

వీరులపాడు:మండలంలోని పెద్దాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు శుక్రవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి నివాసంలో శనివారం సాయంత్రం నాలుగు గంటలకు మండల స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరుగుతుందన్నారు. మాజీ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పంచాయతీ కార్మికులకు సీఐటీయూ మద్దతు



కార్మికులకు మద్దతు పలుకుతున్న సీఐటీయూ నాయకులు

చిల్లకల్లు(జగ్గయ్యపేట):గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలంటూ మూడు రోజులుగా ఆందోళన చేస్తున్న కార్మికులకు శుక్రవారం సీఐటీయూ నాయకులు మద్దతు పలికారు. జిల్లా నాయకులు సోమేశ్వరరావు మాట్లాడుతూ 15 మంది కార్మికులకు ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవటం బాధాకరమన్నారు. కార్మికులకు వేతనాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పంచాయతీకి ఆదాయం ఉన్నా కార్మికులకు మాత్రం వేతనాలు ఇవ్వటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదని తెలిపారు. కనీసం స్థానిక ప్రజాప్రతినిధి కూడా కార్మికుల సమస్యలను పట్టించుకోవటం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతన బకాయిలను చెల్లించాలని లేకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌస్‌మియా, కార్మికులు నాగలక్ష్మీ, లక్ష్మీ, నరసమ్మ, గోపన్న కుమారి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

నందిగామ రూరల్:మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని లేని పక్షంలో ఈ నెల 21 నుంచి సమ్మెలోకి వెళతామని పారిశుద్ధ్య కార్మిక యూనియన్ నాయకుడు సైదా తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కమిషనర్ లోవరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇప్పటికే పలువురు కార్మికులు సమ్మెబాట పట్టారన్నారు. కార్మికులకు రూ. 26 వేల కనీస వేతనం అందించటంతో పాటు 62 ఏళ్లకు వయో పరిమితిని పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని, ఆప్కాస్‌ను రద్దు చేయొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగరాజు, ప్రసాద్, మాణిక్యం, ఏసోబు, గోపి, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

లింకులు క్లిక్ చేస్తే ప్రమాదం

నందిగామ టౌన్:లింకులు క్లిక్ చేయటం వల్ల పర్సనల్ డేటా లీకవుతుందని అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ అభిమన్యు తెలిపారు. సబ్ డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏసీపీ తిలక్ ఆదేశాలతో స్థానిక అక్షర జూనియర్ కళాశాల విద్యార్థినులకు సైబర్ నేరాలు, మహిళల భద్రత, శక్తి యాప్ వాడకం, మాదక ద్రవ్యాల దుష్ప్రభావం, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, తదితర అంశాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇమేజ్ మానిప్యులేషన్ టూల్స్ వినియోగించి అశ్లీల వీడియోలు తయారు చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు.వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళి

నందిగామ రూరల్: అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనం ఏర్పాటుకు ప్రభుత్వం 6.8 ఎకరాల భూమిని కేటాయించటం హర్షణీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ఆర్యవైశ్య సంఘాల నాయకులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి శుక్రవారం ఆమె పూల మాలలు వేసి నివాళులర్పించారు. అమరజీవి త్యాగం తెలుగు జాతి చరిత్రలో మరపురాని అధ్యాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక వాసవీ మార్కెట్‌లో అమరజీవి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు



సాక్షి స్పందన

నందిగామ రూరల్:పట్టణ ప్రజల అవసరాల మేరకు ఎటువంటి అంతరాయం కలగకుండా తాగునీటి సరఫరా చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ లోవరాజు తెలిపారు. కీసర మునేటి నుంచి పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్‌కు పట్టణంలోని రైతుపేట వద్ద శుక్రవారం యుద్ధప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించారు. పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు వృథా అనే వార్తను సాక్షి దినపత్రిక ప్రచురించింది. స్పందించిన అధికారులు మరమ్మతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పైప్‌లైన్ లీకేజీలతో పాటు ఇంజినీరింగ్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మెలోకి దిగటంతో తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగిందన్నారు. శనివారం నుంచి తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏఈ ఫణి శ్రీనివాస్, రంగారావు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ రమాదేవి

వత్సవాయి: వర్షాకాలంలో నేపథ్యంలో గ్రామాల్లో అంటువ్యాధులు, విషజ్వరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ కొలుసు రమాదేవి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అన్ని శాఖలకు చెందిన అధికారులు తమ శాఖలకుచెందిన పనితీరు గురించి వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో అంతర్గత రహదారుల అభివృద్ధి నిమిత్తం ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించామని చెప్పారు. గత ఏడాది వరదలకు దెబ్బతిన్న మంచినీటి పైపులైన్ల మరమ్మతులు ఇప్పటికే పూర్తయ్యాయని పేర్కొన్నారు. వారం రోజుల్లో మంచినీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. గ్రామాల్లోని సైడ్ కాలువల్లో మురుగును తొలగించి వీధుల వెంట బ్లీచింగ్ చల్లించాలని సూచించారు. అదేవిధంగా హోటళ్ల నిర్వాహకులు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా డంపింగ్ యార్డులలో వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు యేశపోగు దేవమణి, వైస్ ఎంపీపీలు కాటేపల్లి రామలక్ష్మీ, కొలికపోగు వెంకటేశ్వర్లు, తహశీల్దార్ జి వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్ రాంబాబు, ఎంఈవో ఎల్ నాగరాజు పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

న్యాయమూర్తిపై పోస్టింగులు బాధాకరం



నందిగామ కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

నందిగామ టౌన్:న్యాయమూర్తులు, న్యాయవాదులను అవమానించేలా సామాజిక మాధ్యమాలలో సందేశాలు పెట్టటం, చులకనగా చేసి మాట్లాడటం మంచి పద్ధతి కాదని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబు తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తిపై అసభ్యకరంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్‌లు చేయటాన్ని, న్యాయవాదులపై జరుగుతున్న దాడులు, అవమానాలను నిరసిస్తూ శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయమూర్తులపై సామాజిక మాధ్యమాల ద్వారా అసభ్యకరమైన పోస్టులు పెట్టటం హేయమైన చర్యన్నారు. న్యాయవాదులపై సైతం వరుసగా దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. న్యాయవాదులను చులకన భావంతో మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మన్నెం నారాయణరావు, కొమ్మినేని మాలేశ్వరరావు, కస్తాల నూతన్ ప్రసాద్, మాడుగుల స్టాలిన్ బాబు, యరగొర్ల రామారావు, ఆనందం విజయ్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



పేటలో కోర్టు ముందు నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

జగ్గయ్యపేట అర్బన్:హైకోర్టు గౌరవ న్యాయమూర్తి కె.శ్రీనివాసరెడ్డిపై అభ్యంతర, అమానుష సోషల్ మీడియా అపహస్య చర్యలను బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు వంశీ మోహన్, భాగ్యశ్రీ, తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాది అయ్యప్పలపై దుండగుల దుశ్చర్యలను నిరశిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు అవమానీయ చర్యలను తీవ్రంగా ఖండించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో న్యాయవాదులు దాసరి నాగేశ్వరరావు, ఎం.ఆంజనేయులు, బూడిద నరసింహారావు,అంకమరాజు, పూల నాగరాజు, రావూరి ప్రసాద్, చిన్న గాంధీ, నరేష్, బిక్షమయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి చొరవ

కేడీసీసీబీ చైర్మన్ రఘురామ్

జగ్గయ్యపేట అర్బన్:రైతులకు సకాలంలో ఎరువులు అందించడమే లక్ష్యంగా కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో అన్ని సహకార సంఘాల్లో సమగ్ర చర్యలు చేపట్టినట్లు కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులకు నాణ్యమైన ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రతి సంఘంలో అవసరమైన లైసెన్సులను పొందించి మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరా ప్రక్రియను వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు. ఈ చర్యల్లో భాగంగా గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రంలో సహకార సంఘాల సిబ్బందికి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించామని చెప్పారు. ప్రతి సంఘంలో ఎరువులు నిల్వ ఉండేలా తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశామని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నేరుగా సరఫరా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులకు ఎరువులను సమయానికి అందించడంతో పాటు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోకుండా ఆ ప్రక్రియపై కఠినంగా నిఘా పెట్టాలని సూచించినట్లు రఘురామ్ తెలిపారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా సహకార వ్యవస్థను మరింత సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఆయన ఆకాంక్షించారు.